పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో మీనాక్షి



ప్రశాంతంగా
పరాక్ సర్వేక్షణ్ 2024 పరీక్ష

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరాక్ సర్వేక్షణ్-2024 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో మీనాక్షి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 139 కేంద్రాల్లో 3,415 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. మూడో తరగతికి సంబంధించి 1,021 మంది, 6వతరగతికి సంబంధించి 1,060 మంది, 9వతరగతికి సంబంధించి 1,334 మంది పరీక్షలు రాశారని తెలిపారు. 153 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, 139 మంది అబ్జర్వర్లు పరీక్షలను పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీఈబీ సెక్రటరీ జె.విజయభాస్కర్, మాస్టరు ట్రైనర్లు ఖాసింఖాన్ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులను నిలిపివేయండి

● డీఈవోకు ఎమ్మెల్సీ సూచన

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ జిల్లావ్యాప్తంగా 829 మంది ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను నిలిపివేయాలని డీఈవోను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం కడపలో డీఈవో మీనాక్షిని ఆమె కార్యాలయంలో కలిసి మాట్లాడారు. డీఈవో జారీ చేసిన నోటీసులతో ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. దీనిని విద్యాశాఖమంత్రి నారాలోకేశ్, కమిషనర్ విజయరామరాజు దృష్టికి తీసుకెళ్లామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఇటువంటి నోటీసులు జారీ చేయమని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. అపార్ నమోదులో కొన్ని టెక్నికల్ సమస్యలున్న నేపథ్యంలో సామరస్యంగా ఆ సమస్యలు పరిష్కరించుకుని నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు నిలిపివేయాలని ఆమెకు సూచించారు. డీఈవో కూడా దానికి అంగీకరించినట్లు ఎమ్మెల్సీ మీడియాకు తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ - కొట్టాయం (07151) మధ్య కడప మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలును జనవరి 2, 9, 16, 23 తేదీల్లో నడపనున్నట్లు కడప సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈ రైలు గురువారం సాయంత్రం 3.40గంటలకు కాచిగూడలో బయలుదేరి అదేరోజు రాత్రి 11.29గంలకు ఎర్రగుంట్ల చేరుకుంటుంది. కడపకు అర్ధరాత్రి 12.08కి, రాజంపేటకు 12.55గంటలకు చేరుకుని మరుసటిరోజు సాయంత్రం 6.50గంటలకు కొట్టాయం చేరుకోనుంది. కొట్టాయం నుంచి కాచిగూడ (07152) రైలు జనవరి 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు కొట్టాయంలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.05కు రాజంపేట, 1.03కి కడప, 1.40 ఎర్రగుంట్ల చేరుకుని రాత్రి 11.40గంటలకు కాచిగూడ చేరనుంది. అయ్యప్పభక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోషల్ మీడియా పోస్టులపై
నలుగురిని విచారించిన పోలీసులు

కడప క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రతిపక్ష నేతలే టార్గెట్‌గా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులకు సంబంధించి కడప సైబర్ సెల్ పోలీసులు నలుగురిని విచారించారు. పులివెందుల డీఎస్పీ మురళినాయక్ ఆధ్వర్యంలో బుధవారం కడప సైబర్ సెల్ కార్యాలయంలో వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సునీతారెడ్డి, వరకుమార్, లింగారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దాసరి శరత్‌కుమార్‌ను గంటల పాటు విచారించారు. గత ప్రభుత్వంలో సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో పాటు మార్ఫింగ్ చేసి ఫొటోలు వీడియోలు పెట్టారు. ఇప్పటికే ఈ కేసులో వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురికి 41ఏ నోటీసులు అందించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేందుకు ఎవరు సహకరించారు, ఆర్థిక సహాయం ఎవరు అందించారు అనే వాటిపై వారిని విచారించినట్లు తెలుస్తోంది.

కడప స్టీలు ప్లాంటుపై..
మోసం చేసిన మోదీ ప్రభుత్వం


● కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప స్టీలు ప్లాంటుపై మోదీ ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతానికి ఈ అంశం తమ ముందు లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి మంగళవారం లోక్‌సభలో చెప్పడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ సమస్య శాశ్వతంగా పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర విభజన సమయంలో 13వ షెడ్యూలులో కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని నిర్ణయించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికే ఉక్కు పరిశ్రమ ఏర్పాటయ్యేదన్నారు. తరువాత వచ్చిన వైసీపీ, టీడీపీ కడప ఉక్కుపై ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఓట్ల కోసమే వైఎస్ జగన్, చంద్రబాబు ఉక్కుపై ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాలంటే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

ఇష్టారాజ్యంగా మైనింగ్

● లీజు ఒకచోట.. తవ్వకాలు మరోచోట ● నిబంధనలు బేఖాతర్

● ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మైనింగ్ నిర్వాహకులు



తమకు లీజుకు ఇచ్చిన సర్వేనంబర్లతో బెనిట మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేసిన బోర్డు

పెండ్లిమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఏ పార్టీ ఉన్నా హవా మాదే అనేలా మైనింగ్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి అటు ప్రభుత్వానికి పన్నుల రూపంలో డబ్బులు ఎగ్గొట్టి.. ఇటు పేలుళ్లతో జనాన్ని ఇబ్బందులు పెడుతున్నారు. లీజు ఒకచోట అయితే మరోచోట తవ్వుతూ అక్రమాలకు తెరలేపారు. మరో ఓబుళాపురం ఐరన్ ఓర్‌ను తలదన్నేలా నిర్వహిస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలోని చాబలి రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 320లో 165.482 హెక్టార్లలో బెనిట కంపెనీకి ఇనుప ఖనిజం తవ్వుకునేందుకు అనుమతులు ఉన్నాయి. మండలంలో చాలా కంపెనీలకు లీజులు ఉన్నాయి. ఓబులాపురంలో ఐరన్ ఓర్ తవ్వకాలు జరిగేటపుడు ఇక్కడ ఉన్న లోగ్రేడ్ ఇనుప ఖనిజానికి డిమాండ్ ఉండేది. దీంతో అప్పట్లో కొన్ని సంవత్సరాల పాటు ఇనుప ఖనిజం తవ్వకాలు భారీగా జరిగాయి. ఎప్పుడైతే అక్కడ మైనింగ్ ఆగిపోయిందో.. ఇక్కడ కూడా ఇనుప ఖనిజం తవ్వకాలు ఆగిపోయాయి. ఈ ఒక్క బెనిటా కంపెనీ మాత్రం ఇప్పటికీ ఇనుప ఖనిజం తవ్వకాలు జరుపుతోంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

నిబంధనల ప్రకారం ఖనిజాల తవ్వకాలు జరపాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ ప్రాంతాన్ని లీజుకు తీసుకున్నపుడు అందులో పొందు పరిచిన నిబంధనలు పాటించాలి. లేదంటే ఎంతటివారైనా చర్యలు తప్పవు.

- సుబ్రమణ్యం, విజిలెన్స్ మైనింగ్ ఏడీ

నిబంధనలకు నీళ్లు

ఎక్కడైనా మైనింగ్ జరపాలంటే నిర్వాహకులు ఆ ప్రాంతానికి సంబంధించిన గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు ఇవ్వడంతో పాటు ఆ ప్రాంతంలో మౌలిక వసతులు ఏర్పాటుచేయాలి. మైనింగ్ జరిగే ప్రాంతంలో ఐదు మీటర్ల లోతు, ఎనిమిది మీటర్ల పొడవుతో ఒక బెంచ్ మాదిరి 16మీటర్ల విస్తీర్ణంతో స్టెప్ బై స్టెప్ ఏర్పాటు చేస్తూ తవ్వుకుంటూ పోవాలి. ఐదు సంవత్సరాలపాటు మైనింగ్ నిర్వహిస్తే 30 నుంచి 50మీటర్ల లోతు వరకు మాత్రమే తవ్వకాలు జరగాలి. కడప-పులివెందుల ప్రధాన రహదారి నుంచి మాచునూరు గ్రామానికి ఈ మైనింగ్ జరుగుతున్న ప్రదేశం ద్వారానే దారి ఉంది. రోడ్డు ఉండే ప్రదేశంలో ఇరువైపులా 50మీటర్లు వదిలిపెట్టి మైనింగ్ తవ్వకాలు జరగాలి. కానీ ఇక్కడ మాత్రం ఒకటి లేదా రెండు మీటర్లు మాత్రమే వదిలిపెట్టి తవ్వకాలు చేశారు. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘన కళ్లకు కట్టినట్లు కనబడుతున్నా వీరిపై చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. ఈ మైనింగ్ కంపెనీకి మరో మైనింగ్ కంపెనీకి మధ్య బఫర్ జోన్ ఉంది. అక్కడ తవ్వకాలు జరపకూడదు. అయినా బఫర్ జోన్‌లో తవ్వకాలు జరిపారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఈ మైనింగ్ జరిగే ప్రాంతం చుట్టు పక్కల చాలా గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ జరిగే బ్లాస్టింగ్ వల్ల రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించుకున్న ఇళ్లు నెర్రెలు చీలి, శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆ గ్రామాల ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నారు. ఇక్కడి గ్రామాల ప్రజలు మైనింగ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పశువులను మేపుకునేందుకు, పొలాల్లో కూలి పనులకు వెళుతుంటారు. కొన్ని రోజుల క్రితం బుడ్డాయిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి పశువుల మేత కోసం వెళ్లి మైనింగ్ జరిగిన ప్రాంతంలోని నీటిలోకి దిగి ఊబిలో కూరుకుపోయి మృతిచెందాడు. కొన్ని సంవత్సరాల కిందట ఈ మైనింగ్ కంపెనీలో రామ్మోహన్‌రెడ్డి, చిన్నోడు అనే ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. అలాగే తుమ్మలూరు గ్రామానికి చెందిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో చనిపోయాడు. మాచునూరు గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తికి ప్రమాదం జరిగి కాలు లేకుండా పోయింది.

తవ్విన గుంతలను పూడ్చరు

ఇనుప ఖనిజం కోసం మీటర్ల మేర లోతుకు తవ్వకాలు జరిపారు. తవ్వకాలు జరిపిన తర్వాత అక్కడ గుంతలను పూడ్చాలి. అలాగే విద్యుత్ లైన్, గృహాలు, రోడ్లు, రైల్వేట్రాక్ పక్కన మైనింగ్ చేయకూడదు. కానీ ఆ నిబంధనలేమీ ఇక్కడ వర్తించవు. రోడ్డు పక్కనే చాలా మీటర్ల లోతు గుంతలు తవ్వి వదిలేశారు. ఏదైన ఇక్కడ పెద్ద వాహనం అదుపు తప్పితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మైనింగ్ చేసిన చోట గుంతలకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రజల ప్రాణాలతో చెలగాటమే. ఇక.. బెనిట కంపెనీకి చాబలి పొలంలో లీజు ఉంటే తుమ్మలూరు, సర్వే నెంబర్ 628, మాచునూరు సర్వే నెంబర్ 320లో కూడా తవ్వకాలు జరిపారు. ఇక్కడ ఇన్ని జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



కొన్ని మీటర్ల మేర తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గుంత



బుడ్డాయిపల్లె హరిజనవాడలో మైనింగ్ పేలుళ్ల ధాటికి పగిలిన ఇంటిగోడ

రోడ్డుకు పక్కనే తవ్వకాలు జరపడంతో ఏర్పడ్డ గుంత



స్కూల్లో టీచర్ అనుమానాస్పద మృతి

● విద్యార్థులు కొట్టి చంపారని భార్య ఆరోపణ

● దాడి కాదు.. కుప్పకూలారని హెచ్ఎం వివరణ



మృతుడు ఎజాజ్ (ఫైల్‌ఫొటో)

రాయచోటిటౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. గొడవ పడుతున్న విద్యార్థులను మందలించినందుకు ఆయన్ను విద్యార్థులే కొట్టి చంపారని భార్య చెబుతుండగా, అలాంటిదేమీ లేదని ఒక్కసారిగా కుప్పకూలిపోయారని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని కొత్తపల్లె జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు, మృతుడి భార్య కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఎజాజ్ (42) ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. బుధవారం సుమారు 3 గంటల ప్రాంతంలో ఆయన ఒక్కసారిగా పాఠశాలలోనే కుప్పకూలిపోయారు. వెంటనే పాఠశాల సిబ్బంది ఎజాజ్ భార్యకు సమాచారం ఇచ్చి, ఆయనను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఎజాజ్ అప్పటికే చనిపోయారని చెప్పారు. ఎజాజ్ భార్య రహిమూన్ మీడియాతో మాట్లాడుతూ.. తన భర్తకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని, ఐదు పూటలా నమాజు చేస్తాడని, ప్రతిరోజు వాకింగ్‌కు వెళ్తాడని చెప్పారు. తన భర్త ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్తాడని, అది భరించలేని కొంతమంది ఉపాధ్యాయులు బయట వాళ్లతో కలిసి తన భర్తను విద్యార్థుల చేత కొట్టించి చంపించారని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థులు కొట్టిన విషయాన్ని ఉపాధ్యాయులంతా కలిసి బయటికి రానివ్వకుండా తన భర్త గుండెపోటుతో చనిపోయాడని చెబుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు విచారించి తన భర్తను కొట్టి చంపిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన వారిని, సహకరించిన ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఎజాజ్ పాఠశాలలో కుప్పకూలిపోయారని, ఆయనపై విద్యార్థులు దాడి చేయలేదని హెచ్ఎం చెప్పారని అన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టుగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

ప్రారంభమైన రైల్వేసంఘాల ఎన్నికలు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం రైల్వేగుర్తింపు పొందిన సంఘాలకు ఎన్నికలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల్లో ఐదు సంఘాలు పోటీ పడుతుండగా వీటిలో ప్రధానమైనవి ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ అని చెప్పాలి. ఈ రెండు సంఘాల మధ్య పోటీ కొనసాగనుంది. ఈ పోటీల్లో ఎంప్లాయిస్ సంఘ్ నుంచి మర్రి రాఘవయ్య, మజ్దూర్ యూనియన్ నుంచి సీహెచ్ శంకర్‌రావు బరిలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1500 మంది రైల్వే ఓటర్లు ఉండగా కడప రైల్వేస్టేషన్ పరిధిలో 374 మంది ఉన్నారు. రెండురోజుల పాటు ఈ ఎన్నికలు జరగనున్నాయి. కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో తొలిరోజు బుధవారం 211 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

ప్రొద్దుటూరులో వైసీపీ అక్రమాలపై..
ఆర్డీ విచారణ ముమ్మరం

● గతంలో పనిచేసిన కమిషనర్ల పాత్రపై సైతం ఆరా

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై మున్సిపల్ ఆర్డీ విశ్వనాద్ ఆధ్వర్యంలో విచారణ ముమ్మరం చేశారు. బుధవారం ఇంజనీరింగ్ విభాగాలతో పాటు టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి అక్రమ కట్టడాలను సైతం పరిశీలించారు. ముఖ్యంగా స్మార్ట్ స్ట్రీట్ పేరుతో మైదుకూరు రోడ్డులో జరిగిన పనుల్లో నిబంధనల ఉల్లంఘనపై ఆరా తీశారు. ఎస్టిమేట్‌లు, టెండర్లు అనుమతులతో పాటు బిల్లుల చెల్లింపులను నిశితంగా పరిశీలించారు. ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతకు సంబంధించి కోర్‌కటింగ్ తీశారు. టౌన్‌ప్లానింగ్‌లో అనుమతులు ఇచ్చిన అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ ఆర్డీ సంజీవ్‌కుమార్, మున్సిపల్ ఆర్డీ విశ్వనాద్ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఎర్రగుంట్ల రోడ్డులోని గోల్డ్‌ప్లాజా కాంప్లెక్స్‌ను పరిశీలించారు. అలాగే పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు అక్రమ కట్టడాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇచ్చిన ప్లానుకు కట్టిన నిర్మాణాలకు తేడాలను నమోదు చేసుకున్నారు.

తూతూ మంత్రంగా ముగిసిపోతుందా?

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై చేపట్టిన విచారణ తూతూ మంత్రంగా ముగిసిపోతుందా అనే ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీకి సంబంధించిన అధికారులు విచారణ బృందంలో ఉండటం అందునా పక్క జిల్లాకు సంబంధించిన అధికారులు ఉండటం వలన ఒకరికి ఒకరు సహకరించుకోవడంలో భాగంగా విచారణను తూతూమంత్రంగా ముగిస్తారని ప్రచారం సాగుతోంది. ఇంజనీరింగ్ సెక్షన్‌లో జరిగిన కోట్ల రూపాయల పనులకు సంబంధించి అక్రమాలు వెలికితీస్తారా లేక వచ్చితినమ్మా పోతినమ్మా చందంగా ముగిస్తారా అని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అలాగే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో దాదాపు 200 కట్టడాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చారు. అందులో భారీ కట్టడాలే 50కి పైగా ఉన్నాయి. వీటిలో పెద్ద షాపింగ్ కాంపెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు ఆసుపత్రులు మాల్స్ ఉన్నాయి. రెసిడెన్సియల్ ప్లాన్ తీసుకుని కమర్షియల్ కట్టినవి లెక్కలేనన్ని ఉన్నాయి. అలాగే ఒక్కో గదికి ప్లాన్ అప్రూవల్ తీసుకుని వందలాది గదులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ 90శాతం అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. విచారణకు వచ్చిన అధికారులు వీటిని ఏ మేరకు గుర్తిస్తారో వేచి చూడాల్సి ఉంది.



విచారణలో భాగంగా ఎర్రగుంట్ల రోడ్డులో కోర్ కటింగ్ తీస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి
రెవెన్యూ సదస్సులు

● రేపటి నుంచి జనవరి 8 వరకు

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాజధాని అమరావతి నుంచి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులతో కలసి రాష్ట్ర రెవెన్యూ స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హాజరయ్యారు. మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 6వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మ్యుటేషన్లు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22(ఏ) దుర్వినియోగం మొదలైన అంశాలపై గ్రామస్తుల నుంచి అర్జీలను స్వీకరించి వెంటనే రశీదు ఇవ్వాలన్నారు. అర్జీలు స్వీకరించిన వెంటనే ఆన్‌లైన్ చేసి విచారణ మొదలు పెట్టాలన్నారు. రెవెన్యూ సదస్సు నిర్వహించిన రోజు నుంచి 40 రోజుల్లోగా ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఫ్రీహోల్డ్ ల్యాండ్స్ జీవో ప్రకారంగా అనుమతించిన పట్టాలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో ఆర్డీవో స్థాయి నుంచి గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్, ఎండోమెంట్, పోలీసు అధికారులతో పాటు రిజిస్ట్రేషన్ అధికారులు, బ్యాంకర్లు, సహకార బ్యాంకు అధ్యక్షులు, అనుబంధ శాఖల అధికారులు తప్పక హాజరై సమస్యలపై స్పందించాలన్నారు. జిల్లావ్యాప్తంగా జెడ్ హెచ్‌సీ భూముల వివరాలను సేకరించి, అనుభవదారులు ప్రభుత్వ పరంగా లబ్ధి పొందారా అనే విషయాలను పరిశీలించాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, ఎస్డీసీ ఎల్ఏ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం ఉద్యోగుల బాధ్యత

ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ఉద్యోగులందరి బాధ్యత అని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులకు వచ్చే అర్జీదారులను కుర్చీలో కూర్చోబెట్టి, ఆప్యాయంగా పలకరిస్తూ అర్జీలను స్వీకరించాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న సామాజిక సమస్యలు, వ్యక్తిగత సమస్యలు నిబద్ధతతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో రెవెన్యూ వీఆర్‌ఏ, సర్వేయర్, సిబ్బంది రెండురోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని రెవెన్యూ రికార్డులను చూపించాలన్నారు. గ్రామస్తులు అడిగిన వాటికి స్పష్టంగా సమాధానాలు చెప్పాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించే బాధితులను అర్జీతో పాటు సెల్ఫీ కూడా తీయాలన్నారు. కాగా.. ఈ కార్యక్రమంలో తొలుత రెవెన్యూ సదస్సులపై కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

బతుకు దెరువు కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు

- కువైత్‌లో చౌడసముద్రం వాసి మృతి..
- శోకసంద్రంలో కుటుంబీకులు



మృతి చెందిన ఆజాద్‌బేగ్

ములకలచెరువు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైత్‌కు వెళ్లిన చౌడ సముద్రం వాసి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్థుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం చౌడ సముద్రం వాసి ఆజాద్‌బేగ్(45) బతుకుదెరువు కోసం రెండేళ్ల కిందట కువైత్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య మక్బూల్, కుమార్తె నగీనా, కొడుకు నాసీర్‌బాషా ఉన్నారు. ఈ క్రమంలో కువైత్‌లో పనిచేస్తూ అజాద్‌బేగ్ ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. సహచరులు గమనించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం కుటుంబీకులకు సమాచారం అందడంతో వారు విషాదంలో మునిగిపోయారు. కాగా ఆజాద్‌బేగ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య



మృతిచెందిన రామాంజులు

సంబేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తండ్రి, భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాలవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామాంజులు (21) రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో భార్య అతని తండ్రి మందలించినందుకు మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. కాగా బుధవారం తెల్లవారే సరికి వారి మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు.

వైరల్ ఫీవర్‌తో చిన్నారి మృతి



దేవాన్షి (ఫైల్ ఫొటో)

పుల్లంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్వరం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సుమారు 15 నెలల చిన్నారి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూసింది. పుల్లంపేట మండలం చెర్లోపల్లె అరుంధతివాడకు చెందిన వెంకటేశ్, సాయితేజశ్రీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె దేవాన్షి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో కడపలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చి రాజంపేటలోని ప్రైవేటు డాక్టర్ వద్ద చూపించారు. ఎంతకీ తగ్గకపోవడంతో కడప రిమ్స్‌కు తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చిన్నారి మృతిచెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

రేపటి నుంచి కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7 తేదీల్లో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా యువకుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సాంకేతిక విద్యాశాఖ ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప రీజియన్ పరిధిలోని 32 ప్రభుత్వ, ప్రైవేటు, ఫార్మసీ కళాశాలల నుంచి 140 ఆవిష్కరణలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 6వ తేది ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సుబ్రమణ్యం హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమంగా నిలచిన 20 ఆవిష్కరణలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతికి రూ.10 వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 550 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదర్శం.. ఆ క్యాంటీన్

- జిల్లా ఆసుపత్రిలో మెప్మా ఆసరాతో క్యాంటీన్
- స్వయం కృషితో అభివృద్ధి చేసిన లక్ష్మీదేవి
- ఇంటి భోజనం మరిపించేలా వంటలు
- పలువురు మహిళలకు ఉపాధి కల్పన



సమత క్యాంటీన్ బృందంతో బండి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న క్యాంటీన్ మహిళలకు ఉపాధినిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్యాంటీన్‌ను 10 సంవత్సరాలుగా మహిళలే నిర్వహిస్తుండటం విశేషం. గతంలో జిల్లా ఆసుపత్రి వద్ద క్యాంటీన్‌లేక రోగులు, వారి బంధువులు బయట అధిక ధరలకు భోజనాలు కొనలేక ఇబ్బందులు పడేవారు. దీనిని గమనించిన అప్పటి కలెక్టర్ కోన శశిధర్ హయాంలో 'సమత పట్టణ మహిళా సమాఖ్య' ఆధ్వర్యంలో 2014లో జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) అధ్యక్షురాలు బండి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో క్యాంటీన్‌ను నిర్వహించే వారు. ఆమె మెప్మాలోని మహిళలను క్యాంటీన్‌లో పనికి పెట్టుకుని పేదప్రజలను, రోగులను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకే రుచికరమైన భోజనం అందించాలని సంకల్పం పెట్టుకున్నారు. క్యాంటీన్ ప్రారంభంలో రోజుకు రూ.200 నుంచి రూ.300 వ్యాపారం మాత్రమే జరిగేది. అయినా ఆమె నిరుత్సాహ పడకుండా కష్టాన్ని నమ్ముకుని రోగుల కడుపు నింపాలని దృఢ నిశ్చయంతో ఇంటిని మరిపించే విధంగా భోజనాలను తయారు చేస్తూ రోగులు, రోగుల బంధువులతో మన్ననలు పొందుతూ వచ్చారు. కరోనా సమయంలో కూడా రోగులకు భోజన సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. నైట్ షెల్టర్‌లో ఉండేవారికి రోజుకు ఒక్కో భోజనం రూ.25కే వారు చెప్పిన మెనూతోనే భోజనం ఇచ్చేవారు. ఇలా ఒక సంవత్సరం పాటు నైట్‌షెల్టర్ వారికి భోజనాలు పంపించారు.

మెప్మాలో సభ్యురాలిగా మొదలై..

లక్ష్మీదేవి 2007 నుంచి మెప్మాలో సభ్యురాలుగా ఉంటూ వారి గ్రూపునకు లీడర్‌గా కొనసాగారు. 2011వ సంవత్సరంలో ఆమె లీడర్‌గా నిర్వహిస్తున్న పనితీరును చూసి అధికారులు టీఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా నియమించారు. అప్పటి నుంచి ఆమె మహిళల అభివృద్ధికి కావాల్సిన ఎన్నో సూచనలు, సలహాలు అందించారు. అనేక సంవత్సరాలుగా ఆమె మహిళల అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు. ఆమె సేవా దృక్పథానికి మెచ్చి అధికారులు కరోనా అనంతరం క్యాంటీన్ బాధ్యతలు పూర్తిగా ఆమెకే అప్పగించారు. దీంతో లక్ష్మీదేవి మెప్మాలో రూ.2 లక్షలు లోను తీసుకుని క్యాంటీన్‌ను మరింత అభివృద్ధి చేశారు. క్యాంటీన్ ప్రారంభం నుంచి నేటి వరకు ఆరుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహించాలనుకుంటే వీరి క్యాంటీన్‌లోనే వంటకాలు తయారు చేయిస్తారు.

ఇంటిని మరిపించే భోజనమే లక్ష్యం - బండి లక్ష్మీదేవి, యజమానురాలు



మా క్యాంటీన్‌కు వచ్చే రోగులు, వారి బంధువులకు ఇంటిని మరిపించే విధంగా భోజనాలు ఇవ్వడమే మా లక్ష్యం. నాతోపాటు పనిచేసే మహిళల సహ కారంతోనే క్యాంటీన్‌లో ఇంటిని మరిపించే భోజనాలను వండుతున్నాం. క్యాంటీన్‌లో ఆరుగురు మహిళలు పనిచేస్తున్నారు. మా స్టాఫ్‌కు మహిళా దినోత్సవం రోజున చిరుసన్మానం చేసి బట్టలు అందిస్తాను. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా బోనస్ ఇచ్చి వారిని గౌరవిస్తాను. మెప్మావారు అందించే ఆర్థిక ఆసరాతో మహిళలు అభివృద్ధి చెంది స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలన్నదే నా ఆశయం.

రాగి సంగటి బాగుంది

- మునెమ్మ, పేషంట్ బంధువు



ఈ క్యాంటీన్‌లో రాగిసంగటి, అందులోకి ఇచ్చే కూరలు చాలా బాగున్నాయి. ఇక్కడ పనిచేసే స్టాఫ్ కూడా వచ్చిన వారితో చాలా మంచిగా మాట్లాడుతూ వారికి ఏమికావాలో అడిగి మరీ వడ్డిస్తుంటారు. తక్కువ ధరలోనే మంచి రుచికరమైన సంగటి తినడం సంతోషం కలిగించింది.

కలిసికట్టుగా పనిచేస్తాం

- లక్ష్మి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్ ప్రారంభం నుంచి పనిచేస్తున్నాను. ఇందులో వచ్చే జీతంతోనే మెప్మాలో తీసుకున్న రుణం నెల నెలా కంతులు కడుతున్నాను. ఇక్కడ మేమంతా కలిసికట్టుగా పనిచేస్తూ క్యాంటీన్‌కు వచ్చేవారికి మంచి భోజనం అందిస్తున్నాం.

మాలో ఒకరిగా

- జయమణి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్‌లో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. మా యజమానురాలు మాలో ఒకరిగా కలిసిపోయి పనిచేస్తున్నారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి మంచి రుచికరమైన భోజనం అందించాలని కోరుకుంటారు.

కడప, రాయచోటిలో...

డ్రగ్స్ నియంత్రణ విభాగాలు

- ఒక్కో జిల్లా కార్యాలయంలో ఎస్‌ఐ సహా సిబ్బంది
- రీజనల్ స్థాయిలో సీఐ అధికారి పర్యవేక్షణ
- తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు
- ఫిర్యాదులు చేయడానికి 1972 టోల్ ఫ్రీ నంబరు
- నేరుగా అమరావతిలోని 'ఈగల్' స్టేషన్‌తో అనుసంధానం

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న డ్రగ్స్ చలామణిని నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సమాయత్తమవుతోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న దశలో దీన్ని తుద ముట్టించేందుకు రాష్ట్ర స్థాయిలో 'ఈగల్' (ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించడానికి ఈగల్ చీఫ్‌గా (నార్కోటిక్) ఐజీ స్థాయి అధికారి ఆకే రవికృష్ణను నియమించారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడంపై ఈగల్ దృష్టి సారించనుంది. ప్రధానంగా విద్యార్థులు, యువత ఈ మహమ్మారి బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు వివిధ రకాల వ్యూహాలను ఈగల్ అమలు చేయనుంది. ఇప్పటి వరకూ మాదక ద్రవ్యాలను నియంత్రించడానికి స్థానిక పోలీసులు మాత్రమే చొరవ చూపాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ బాధ్యతలను ఈగల్ తీసుకోనుంది. ఎన్టీడీడీ (ట్రాన్స్‌పోర్ట్, డెస్టినేషన్, డిమాండ్) పై ఈగల్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది.

రెండు జిల్లాల్లో.. ఈగల్ సెల్‌లు

రాష్ట్ర స్థాయిలో ఈగల్ సమర్థవంతంగా పనిచేయడంతో క్షేత్ర స్థాయిలో జిల్లాల్లో ఈగల్ సెల్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈ విభాగం నేరుగా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే ఎస్పీఎస్ (ప్రత్యేక రాష్ట్ర స్థాయి పోలీసు స్టేషన్) సెల్‌కు మాత్రమే బాధ్యత వహించనుంది. కడప, రాయచోటిలో ఈగల్ సెల్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ విభాగాల నిర్వహణను ఎస్‌ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. తగినంత మంది ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌ను నియమించనున్నారు. ప్రాథమికంగా మత్తు పదార్థాల ఉనికి సంబంధిత సమాచారాన్ని రహస్య సేకరణ ద్వారా సమీకరించనున్నారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. అనంతరం పట్టుబడిన వారిని స్థానిక పోలీసు స్టేషన్లకు అప్పగించి విచారణ చేయించనున్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈగల్ విభాగాలను రీజినల్ స్థాయిలో ఒక సీఐ పర్యవేక్షించనున్నారు. వీటన్నిటినీ నేరుగా అమరావతి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రధాన కేంద్రంతో అనుసంధానం చేస్తున్నారు. ఈగల్ నమోదు చేసే కేసులను విచారించి తొందరగా పరిష్కరించడానికి రాయలసీమకు సంబంధించి తిరుపతిలో ఒక ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారమేదైనా వుంటే 1972 టోల్ ఫ్రీ నంబరుకు చేరవేయవచ్చు. సమాచారం తెలిపే వ్యక్తులకు సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా వుంచుతారు.

సంచలనం కలిగించిన పీలేరు సంఘటన

ఇటీవల మత్తు పదార్థాల వ్యసనపరులైన ఇద్దరు యువకులు పీలేరు సమీపంలో రైలు ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన సంఘటన సంచలనం కలిగించింది. గంజాయి మత్తుకు బానిసలైన యాసిన్‌అలీ(17), కిరణ్‌కుమార్(20) ఇంటర్మీడియట్ విద్యార్థులు 2024 అక్టోబరు 23న రాత్రి రైలు పట్టాలపై కూర్చుని మత్తు పదార్థాలు సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఈ సంఘటనతో మాదక ద్రవ్యాల ఉనికిని ఈ ప్రాంతంలో మొదటిసారిగా తేటతెల్లం చేసింది. ఆ వెంటనే గంజాయి లేదా మాదక ద్రవ్యాల ఆనవాళ్ల కోసం కలికిరి, పీలేరు పట్టణాల్లో విస్తృతంగా గాలించినా లభ్యం కాలేదు. ఇలాంటి సందర్భాల్లో రహస్య విచారణ ద్వారా సమాచారం సేకరించడానికి ఈగల్ విభాగాలు కృషి చేయనున్నాయి. అంతేగాకుండా తల్లిదండ్రులకు, బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మొత్తం మీద మత్తు పదార్థాల నిర్మూలన కోసమే జిల్లా స్థాయిలోని విభాగాలు క్షేత్ర స్థాయిలో పనిచేయనున్నాయి.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) 'అక్కడ ఇళ్ల నిర్మాణా లెలా....?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి మదనపల్లి డివిజన్ హౌసింగ్ యంత్రాంగం స్పందిం చింది. పెద్దమండ్యం మండలంలో బుధవారం హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి పర్యటించారు. జగనన్న లే అవుట్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వెలిగల్లు, పెద్దమండ్యం, పి.తురకపల్లి జగనన్న లే అవుట్‌ల్లో ఇళ్ల దశల వారీ నిర్మాణాలను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ, సౌకర్యాలపై గ్రామస్తులతో ఆరా తీశారు. అనంతరం కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఇంజనీరు అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి సిబ్బందితో వారు మాట్లాడుతూ మండలంలోని లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి సూచనలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలకు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణ సహాయం అందించాలన్నారు. పెద్దమండ్యం జగనన్న కాలనీల్లో వీధుల్లో వర్షపు నీళ్లు ఇంకిపోడానికి ఉపాధి నిధులతో మట్టి తరలించాలని, లేఅవుట్ ముందుభాగంలో చిన్న కాల్వ తీయాలన్నారు. ఇంజనీరు అసిస్టెంట్లకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అన్ని కాలనీల్లో రోడ్లు, విద్యుత్తు, నీటిసౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అర్హులైన నిరుపేదలు పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంపీడీఓ, సర్పంచ్ బాష, హౌసింగ్ ఏఈ అక్రం, ఇంజనీరు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు





ప్రమాదానికి గురైన లారీ, బస్సు, (ఇన్‌సెట్లో) మృతిచెందిన లారీ డ్రైవర్ పరమానంద్

రాజంపేటటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన రాజంపేట పట్టణ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సును రాజంపేట భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో కడప నుంచి చెన్నైకు వెళుతున్న ఐషర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న నీరగుండి పరమానంద్(42) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్ లోకేశ్‌రెడ్డికి కుడికాలు, క్లీనర్ కె.నరసింహారెడ్డి చేతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు తనూజ, ప్రవీణ్, సునీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ యల్లమ రాజు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఖాసింపీరా, సిబ్బంది క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతిచెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని దేవర హిప్పిగిరికి చెందినవాడిగా గుర్తించారు.

కారు ఢీకొని మరొకరు...



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సదాశివరెడ్డి

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సదాశివరెడ్డి(53) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కూరపర్తి గ్రామానికి చెందిన సదాశివ రెడ్డి జీవనం నిమిత్తం మదనపల్లెలో నివాసముంటున్నాడు. సొంతపనుల నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణ సమీపంలోని సబ్‌జైలు నిర్మాణ ప్రాంతంలో మదనపల్లె వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబాంబులు పేలి పాడిఆవులకు తీవ్రగాయాలు

- సంఘటనపై విచారించిన పోలీసులు

బి.కొత్తకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అడవిపందుల కోసం అమర్చిన నాటుబాంబులు కొరికి రెండు పాడిఆవులు తీవ్రంగా గాయపడిన సంఘటనపై బుధవారం సీఐ రాజారెడ్డి విచారణ చేపట్టారు. మండలంలోని వేమిలేటికోట పంచాయతీ కొత్తపల్లె శివారులో గుమ్మసముద్రం చెరువు మొరవ వద్ద కొత్తపల్లెకు చెందిన రైతు శివన్న మొక్కజొన్న పంట సాగుచేశాడు. తన పంటను అడవిపందులు ధ్వంసం చేస్తుండడంతో, బి.కొత్తకోట పట్టణం ఆలేటిపల్లె క్రాస్‌లో గుడిసెలు వేసుకుని నివాసం వుంటున్న వెంకటస్వామి చేత నల్లమందు, బెల్లంతో కూడిన నాటుబాంబులను తయారు చేయించి పొలం చుట్టూ అమర్చాడు. అది ఎవరికీ తెలియకుండా రహస్యంగా వుంచారు. అది తెలియక అదే కొత్తపల్లికి చెందిన మరోరైతు కె.సురేంద్ర పాడిఆవులు రెండు అటుగా వెళుతూ ఆ నాటుబాంబులను బెల్లం వుండలుగా భావించి కొరికాయి. ఒక్కసారిగా అవి పేలడంతో రెండు పాడిఆవుల ముఖాలు ఛిద్రమయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటనపై వీఆర్‌ఓ కోటిరెడ్డి, సీఐ రాజారెడ్డి విచారణ చేశారు. బాధితరైతు సురేంద్ర వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పశుసంవర్థకశాఖ అధికారులు ఈ ఆవులను పరిశీలించి అవి బతకడం సాధ్యం కాదని ధ్రువీకరించారు. సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నారు.



నాటుబాంబు పేలి గాయపడిన పాడిఆవు, సంఘటనా స్థలంలో విచారిస్తున్న సీఐ రాజారెడ్డి

అశ్వ్-2కే24కు దరఖాస్తు చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

కురబలకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు అశ్వ్-2కె24కు దరఖాస్తు చేసుకోవాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 21, 22 తేదీల్లో అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ్-2కె24ను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏటా నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, WWW.mits.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ద్వారకనాథ్, కమాల్‌బాషా, ప్రదీప్‌కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షిత పాల్గొన్నారు.

పేద రైతులకు 'ఉపాధి' అండగా...



దౌలతాపురంలో సాగులో ఉన్న చీనీ తోట

- ఉద్యాన పంటలకు ఆర్థిక భరోసా ఇస్తున్న ఉపాధి పథకం
- బంజరు భూమిలో పండ్లతోటల సాగు
- సిరుల పంట పండిస్తున్న మహిళా రైతు గ్రేసమ్మ

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంటలు కలిసి రాక కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న పేద రైతులకు ఉపాధి పథకం ద్వారా చేపట్టిన ఉద్యాన పంటల సాగు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. పంటల సాగుకు అంతగా అనుకూలంగా లేని బంజరు భూమి కలిగిన రైతులు ఈ పథకం ద్వారా తక్కువ ఖర్చు తో అధిక లాభాలు పొందుతున్నారు. ఇదే కోవలో గ్రేసమ్మ అనే పేద మహిళా రైతు చీనీ సాగు చేపట్టి మంచి ఫలసాయం తీస్తూ.. స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలువురు రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యానపంటలు సాగుకు మక్కువ చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 2019- 20 ఆర్థిక సంవత్సరంలో 1866 మంది రైతులు 2420 ఎకరాల్లో చీనీ తోటలను సాగులోకి తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా ఉద్యాన రెతులకు అందిస్తున్న రాయితీలు మరింత చేయూ త నిస్తున్నాయి. గ్రామీణ రైతులు, రైతు కూలీలను ఈ పథకంలో అనుసంధానం చేయడంతో చీనీ సాగు వైపు మొగ్గు చూపుతూ.. చక్కటి ఉపాధి పొందుతున్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఈపథకం కింద 703 మంది రైతులు 1857 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేపట్టారు. ఇందులో 246 మంది రైతులు 781 ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేశారు.

పేద రైతులకు ఆదర్శంగా... గ్రేసమ్మ



మండలంలోని దౌలతాపురం గ్రామానికి చెందిన నల్లబల్లె గ్రేసమ్మ సాధారణ మహిళ రైతు. ఆమె భర్త రూబిన్ పేరుతో ఎకరా బంజరు భూమి ఉంది. ఆ భూమిలో చీనీ పంటను సాగు చేసి బంగారు పంట పండిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని అతి తక్కువ పెట్టుబడితో చీనీ చెట్ల సాగు చేపట్టి మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. 2019 జూలై చివరిన గ్రేసమ్మకు చెందిన ఎకరా పొలంలో చీనీ పంట సాగు కోసం రూ.64,337ల ఖర్చును సాంకేతిక సహాయకులతో అంచనా వేశారు. వంద చీనీ మొక్కలకు గాను వేతనాల ఖర్చు 88,612, మెటీరియల్‌కు 41454గా అంచనా వేశారు. అలాగే ఆమె జాబ్‌కార్డు హోల్డరు కాబట్టి 380 పనిదినాలకు 2019 సెప్టెంబరు 11న ఆ పని ఆమోదం పొంది.. అదే రోజు నుంచి దౌలతాపురంలోని శ్రమశక్తి సంఘాల ద్వారా పనులు ప్రారంభించారు. బంజరు భూమిని సాగులోకి తెచ్చి సాగుబడి నిర్వహణ, సంరక్షణకు మూడేళ్లపాటు 225 పనిదినాలతో రూ.50,161, వేతనాలకు యాజమాన్య, వ్యయఖర్చులతో 14226 మొత్తం కలిపి 64331లను ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేశారు. ఈ చీనీ మొక్కలకు 5ఏళ్ల రాగానే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటిసారి చీనీపంట దిగుబడి అందింది. మొదటి కాపులో దిగుబడి 1500 కేజీలు రాగా క్వింటా ధర 2300లతో 15 క్వింటాళ్లకు 34500 మేర రాబడి వచ్చింది. కాయల కోత, మార్కెట్ రవాణా ఖర్చులు పోను 30వేలు ఆమెకు లాభంగా చేతికి అందింది. భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో కుటుంబ భారం మోస్తున్న గ్రేసమ్మకు ఉపాధి ద్వారా అందిన చేయూత బలాన్నిచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీపథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రకారం పని కోరిన వారికి పని కల్పించడం జరుగుతుంది. జిల్లాలో ఈ పథకం ద్వారా ఎకరా బంజరు భూమి ద్వారా చీనీ పంటల పెంపకం సాగులోకి తీసుకువచ్చాం. చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామానికి చెందిన మహిళారైతు గ్రేసమ్మ (జాబ్‌కార్డు హోల్డర్) ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆమె చేసిన పనులకు సంబంధించి 50161 రూపాయలు వేతనాలు చెల్లించడం జరిగింది.

- పి.ఆదిశేషారెడ్డి, ఉపాధి పథక సంచాలకులు

పోలీసుల అదుపులో రౌడీషీటర్ హత్య కేసు నిందితులు?

ప్రొద్దుటూరు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రౌడీషీటర్ పప్పీ గ్యాంగ్‌కు చెందిన లీడర్ పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్ర హత్య కేసులో ప్రధాన నిందితులైన యనమల లోకేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని విచారణ నిమిత్తం కడపకు తరలించినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం హత్య సంఘటన వెలు గులోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు రెండు బృందాలుగా పలు చోట్ల గాలింపు చర్యలు చేపట్టారు. హత్య కేసులో నిందితులుగా వున్న లోకేష్‌రెడ్డి, సునీల్ రెడ్డిలకు చెందిన బంధువులు, స్నేహితులతో పాటు సెల్‌ఫోల్‌లో కాల్ రికార్డ్స్ ఆధారంగా కూడా పలువురిని విచారించారు. ఈక్రమంలో బుధవారం లోకేష్ రెడ్డి, సునీల్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి.. విచారణ నిమిత్తం కడప సీసీఎస్‌కు తరలించినట్లు సమాచారం. అయితే ఆదివారం రాత్రి ప్రొద్దుటూరులోని బీజీఆర్ లాడ్జిలో జరిగిన ఈ హత్యకు సంబంధించి.. పప్పీకి లోకేష్‌రెడ్డికి మధ్య ఏమైనా పాతకక్షలు ఉన్నాయా లేక మద్యం మత్తులో మాటామాటా పెరిగి ఘర్షణ పడి హత్య చేశారా అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది.

విద్యార్థులను చితకబాదిన అధ్యాపకుడు

- కళాశాల వద్ద తల్లిదండ్రుల వాగ్వాదం



విద్యార్థుల ఒంటిపై తేలిన వాతలను చూపుతున్న తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇద్దరు విద్యార్థులను అధ్యాపకుడు చితకబాదడం వివాదాస్పదంగా మారింది. ఉదయం 10 గంటల సమయంలో విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటుండగా సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులు చిన్న, కృపాకుమార్‌లు అల్లరి చేస్తుండగా అధ్యాపకుడు శ్రీనివాసులరెడ్డి వారిని వారించారు. అయినా వారి అల్లరి కొనసాగడంతో అధ్యాపకుడు మందలించాడు. ఓ విద్యార్థి తిరగబడడంతో ఆగ్రహించిన అధ్యాపకుడు బెత్తంతో చితకబాదాడు. దెబ్బలపై స్ప్రే చేసి ఇంటికి పంపారు. ఆ దెబ్బలు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్నం 1.30 గంటలకు కళాశాలకు వచ్చి అధ్యాపకులను నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలకు చేరుకుని ఆ కళాశాలపై చర్యలు తీసుకుని అధ్యాపకుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల వద్ద గొడవ జరుగుతుండడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకుడు మాట్లాడుతూ విద్యార్థులు అల్లరి చేస్తుండడంతో అధ్యాపకుడు మందలించాడని.. ఓ విద్యార్థి తిరగబడడంతో బెత్తంతో కొట్టినట్లు తెలిపారు. ఓ విద్యార్థి సోదరుడు కళాశాలకు చేరుకుని తమ వాడు అల్లరి చేయడం తప్పని, తప్పు చేసినవారిని దండించడం సబబేనని తెలిపినట్లు పేర్కొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌లో సెలవుదినాలు తొలగించాలి : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి యాక్షన్‌ప్లాన్‌లో సెలవు దినాలు తొలగించి సవరణ ప్లాన్ విడుదల చేయాలని ఏపీటీఎఫ్ (అమరావతి) రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారాలు పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లినా విద్యార్థులు మాత్రం రారన్నారు. స్థానిక అవసరాల మేరకు ప్లాన్‌ను పూర్తిస్థాయిలో మార్చుకునే వెసులుబాటును జిల్లా విద్యాశాఖ డీసీఈబీలకు కల్పించాలని కోరారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



ఉమామహేశ్వర్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన సంగటి ఉమామహేశ్వరరెడ్డి (26) అనే యువ రైతు అప్పులబాధతో బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వ్యవసాయ పనులు చేసుకోవడంతో పాటు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత మూడేళ్లుగా నాలుగు ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేసేవాడు. పంటలు సక్రమంగా పండక పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో బుధవారం తెల్లవారుజామున రోజువారీలో భాగంగా నడకకు వెళుతున్నట్లు ఇంటిలో చెప్పి బయల్దేరాడు. పుష్పగిరి రోడ్డులో ఉన్న గ్రామ సమీపంలో విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన బంధువులు స్థానికులు అక్కడకు చేరుకుని ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతి చెందాడు. సీఐ పురుషోత్తంరాజు పోలీసులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

600 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత



బద్వేలుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరారెడ్డి కళాశాల వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు నుంచి నెల్లూరు క్రిష్ణపట్నంకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గుంతపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిఘా ఉంచారు. మైదుకూరులోని నవదుర్గ రైస్ ట్రేడర్స్‌కు చెందిన ఏపీ16పీఈ 3219 అనే లారీలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డుకుని తనిఖీ చేశారు. లారీలో 600 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళకు గాయాలు

పెండ్లిమర్రి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో మహిళకు గాయాలయ్యాయి. ఏనుగువారి పల్లెకు చెందిన పేర్ల నాగపార్వతి ఇంటి ముందర ఉండగా పిడుగు పడింది. దీంతో ఆమె అపస్మారకస్థితిలో పోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు.

కమలాపురం మండలంలో గేదె మృతి

కమలాపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లెలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనిమల రాఘవ అనే రైతు ఇంటి సమీపంలో చెట్టు కింద గేదెను కట్టేశాడు. ఆ చెట్టుపై పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గేదె రూ.లక్షా 20వేలు విలువ చేస్తుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

గండికోట పర్యాటక అభివృద్ధికి అడుగులు : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్, సంబంధిత ప్రాజెక్టు ఏజెన్సీతో కలసి గండికోట పర్యాట అభివృద్ధిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రంగా భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించేలా సృజనాత్మకమైననిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యాటకం అనేది ప్రజలకు వినోదం పంచడంతో పాటు వారి భద్రత సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే పోలీసు భద్రతలో భాగంగా 24/7 అందుబాటులో ఉన్న ఒక ఔట్‌పోస్టు నిర్వహణలో ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ , టూరిజంశాఖల సమన్వయంతో పర్యాటక కేంద్రంలో పర్యాటకులకు సంతృప్తికరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. అనంతరం గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు రిపోర్టుకు సంబంధించిన వివరాలను పీపీటీ ద్వారా కలెక్టర్ పరిశీలించి.. టూరిజం శాఖ అధికారికి పలు సూచనలు ఇచ్చారు.

కబ్జాకు గురైన దేవస్థానం స్థలాలను స్వాధీనం చేసుకుంటాం

- అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లలో దేవదాయశాఖకు సంబంధించి అన్యాక్రాంతమైన భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ జిల్లా అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జున ప్రసాద్ తెలిపారు. వేంపల్లెలోని వృషబాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి బస్టాండు పక్కన ఆక్రమణలో ఉన్న 71 సెంట్ల స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అక్కడ నుంచి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశా రు. కొన్ని ఇళ్లకు నోటీసులు అందించారు. త్వరలోనే ఆక్రమించిన స్థలం ఖాళీ చేయాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఎక్కడా కూడా దేవదాయశాఖకు సంబంధించి ఆక్రమణలు ఉన్నా స్వాధీనం చేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అక్కడి ప్రజలు ఈ స్థలానికి సంబంధించి జిల్లా అధికారులతో రీసర్వే చేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్వేచేయిస్తామన్నారు. ఆక్రమించిన స్థలాలను వెంటనే ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈవో విశ్వనాదరెడ్డి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వల భవిష్యత్తు

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ గురుకులం క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. వైస్‌చాన్సలరు మాట్లాడుతూ యూనివర్శిటీలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. క్రమశిక్షణతో మెలగడం, గ్రంథాలయం వినియోగించుకోవడం, అధ్యాపకుల సలహాలు నిరంతరం అమలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ప్రగతికి మార్గాలన్నారు. ఎండీఏ విభాగం ప్రొఫెసరు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భయపడకుండా ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగాఎదుర్కోవాలన్నారు. అనంతరం ప్రొఫెసరు సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ అమృత్ ప్రసాద్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జాతీయస్థాయి క్రీడలకు కేజీబీవీ విద్యార్థినులు



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రత్యేక అధికారిణి ఫణిశ్రీ

అట్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అట్లూరు కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్ 14, బేస్‌బాల్ అండర్ 17 మరియు ఆట్యాపాట్యా జాతీయస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినులు లక్ష్మీ ప్రసన్న, తనూజా, బత్తల దీపిక, అమరావతి, రిషిత, సుధా ఎంపికైనట్లు తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీలతో కలిసి అభినందించారు.

'నిఘా' నేత్రాలు



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీఐ హేమసుందర్ రావు

- నేరస్తులను వెంటాడుతున్న సీసీ కెమెరాలు
- పలు కేసుల ఛేదనలో తోడ్పాటు
- రైల్వేకోడూరులో సీసీ కెమెరాల పనితీరుపై ప్రశంసలు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో ఎన్నో సంచలనమైన కేసుల ఛేదనలో నిఘా నేత్రాలు కీల కపాత్ర పోషిస్తున్నాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ వీధి, టోల్‌గేట్, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్కెట్ యార్డు వంటి ప్రధాన ప్రదేశాలలో నిఘా నేత్రాలు నేరస్తులను వెంటాడుతున్నాయి. వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, క్రయవిక్రయాల్లో రాష్ట్రంలో గుర్తింపు పొందిన రైల్వేకోడూరు పట్టణంలో నేరాల కట్టడికి పోలీసు యంత్రాంగం వినియోగిస్తున్న నిఘా కెమెరాల పనితీరు భేష్ అంటున్నారు కోడూరు వాసులు. నేరాలను అరికట్టడానికి 2017 ఆగస్టు నేలలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ అట్టాడ బాపూజీ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోలు గదిని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన కూడలి, రహదారి, వీధుల్లో ఆధునాతనమైన 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సహాయం లేకుండా అప్పటి సీఐ సాయినాథ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, భక్తవత్సలం కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేసి ఏపీఎండీసీ సంస్థ ద్వారా 9 లక్షల 60వేల రూపాయిలు మరియు దాతల సహకారంతో రూ.5 లక్షలు మొత్తం 15 లక్షల రూపాయిలు నిధులు సేకరించి సీసీ కెమెరాలు విస్తృతంగా ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పట్ట ణంలోని పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నలుగురు పోలీస్ సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో అనేక కేసుల చేధించిన సంఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం సీసీ కెమెరాలు కొన్ని మరమ్మతులకు గురయ్యా యి. వీటికి మరమ్మతులు చేయడంతో పాటు పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలను అరికట్టాలంటే సీసీ కెమెరాలను పూర్తిగా ఏర్పాటు చేయాలని రైల్వేకో డూరు ప్రజలు కోరుకుంటున్నారు.



బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సీసీ కెమెరాల ద్వారా చేధించిన కేసుల వివరాలు

- 2018 సంవత్సరంలో రంజాన్ పండుగ రోజు పాత బస్టాండ్ సినిమా హల్ వద్ద ముస్లిం యువకుడిని దారుణంగా హత్య చేసి పారిపోయారు. సీసీ కెమెరాల ద్వారా హంతకులు ఉపయోగించిన వాహనాన్ని గుర్తించి అప్పటి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం చెన్నైకు వెళ్లి హంతకులను పట్టుకుని కేసును చేధించారు. కేసును చేధించిన ఎస్ఐలకు ఐజీ ప్రతిష్టాత్మకమైన ఏబీసీడీ అవార్డును అందించారు.
- పట్టణంలో కొత్త కోడూరు ప్రాంతంలో సంచలనమైన నాయుడు హత్య కేసును విచారిస్తుండగా హంతకుడు వెళ్లిన మార్గాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసు చేధించారు.
- పట్టణంలో ఓ వ్యాపారి బ్యాంకు నుంచి 3 లక్షల రూపాయిలు తీసుకుని వస్తుండగా కొంతమంది అతన్ని దారి మళ్లించి నగదు ఉన్న బ్యాగును అపహరించారు. సీసీ కెమెరాల ద్వారా గంట వ్యవధిలో నింధితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టణానికి చెందిన ఓ మహిళ తిరుపతి నుంచి వచ్చి ఆటోలో రూ.లక్ష నగదు 20 వేల విలువైన మొబైల్ ఫోన్‌కు మరిచిపోయి వెళ్లిపోయారు. బాధితులు కమాండ్ కంట్రోలుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. బస్టాండ్ వద్ద ఉన్న కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించి బాధితులకు నగదు అందజేశారు.

- పట్టణంలో చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారిని రిమాండ్‌కు తరలించారు. కొంతమంది యువతులు మిస్సింగ్ కేసులను నిఘా కెమెరాల ఆధారంగా చేధించి పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలో జరిగిన పలు యాక్సిడెంట్ కేసులను సీసీ కెమెరాల ద్వారా చేధించిన సంఘటనలు చాలా ఉన్నాయి.

సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నాం.

పట్టణంలోని పలు రద్దీ ప్రదేశాలలో కెమెరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. గంగమ్మ తల్లి కమిటీ సభ్యుల సహకారంతో నూతనంగా 8 కెమెరాలు ఏర్పాటు చేశాం. పట్టణంలో నేరాలు అరికట్టాలంటే 40 కెమెరాలు అవసరం. అన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలంటే సూమారు 10 లక్షల రూపాయిలు నిధులు అవసరం. దాతలు ముందుకు వస్తే త్వరలో రైల్వేకోడూరు పట్టణంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

- హేమసుందర్ రావు, రైల్వేకోడూరు అర్బన్ సీఐ

వరి రైతుకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన వరి రైతుకు ప్రభుత్వం ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మాదినేని రామసుబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎకరా వరి సాగుకు రూ.30 వేలకు పైగా ఖర్చుపెట్టాల్సి వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వరి రైతు ఎక్కువగా నష్టపోతున్నాడన్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించడంతో పాటు నల్లబడ్డ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి భాస్కర్, మాజీ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, రాష్ట్ర నాయకులు అతికారి రవికుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సరోజనమ్మ, శ్రీనివాసరాజు, వెంకటరమణ, రామిరెడ్డి రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి స్థానిక పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డిని ఆదేశించారు. వేంపల్లె ప్రియా తోటకు చెందిన మాజీ ఈఓ ఎస్‌ఏ ప్రతాప్ ఇంటి వద్ద డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, రోడ్లపైనే నీరు నిలుస్తుందని జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయగా, బుధవారం ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్లపై నీరు నిల్వడకుండా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బజారును తెరిపించి రైతులకు ప్రయోజనం చేకూరేలా చూడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ కోరారు. కలెక్టరుతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

శానిటేషన్ పనుల పరిశీలన

పెండ్లిమర్రి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలంలో జరుగుతున్న శానిటేషన్ పనులను జిల్లా పంచాయితీ అధికారిణి రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. అలాగే సచివాలయంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రోగాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాని సూచించారు.

అది పులిపిల్ల కాదు.. కొండపిల్లి?



మాంసాహార జంతువుల పాద ముద్రలు

లింగాల, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో పులిపిల్ల సంచారమంటూ మంగళవారం సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో ప్రజల్లో ఒకింత భయాందోళనలు నెలకొన్నాయి. అటవీ అధికారులు వీడియోలో ఉన్న పులిపిల్లల సంచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అది పులిపిల్ల కాదు.. కొండపిల్లి అని నిర్ధారణకు వచ్చారు. పులివెందుల అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ నవంబరు 28న మురారిచింతల గ్రామంలో ఓ రైతు తనకు ఫోను చేసి పులిపిల్లను చూశానని చెప్పడంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లి అడుగులు పరిశీలించాక అది పులి పిల్ల కాదు.. కొండపిల్లిగా నిర్ధారించామన్నారు. ఇక్కడ కూడా అదే విధంగా జరిగి ఉండొవచ్చని సోమవారం రాత్రి వర్షం వల్ల అడుగులు చెదిరిపోవడంతో పూర్తిగా నిర్ధారణకు రాలేకపోతున్నామన్నారు. అలాగే వీడియోలో జంతువుకు ఎటువంటి చారలు లేకపోవడంతో అది కొండపిల్లిగా అర్థమవుతోందన్నారు. పూర్తి నిర్ధారణ అయ్యేంతవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మాంసాహార జంతువుల పాదముద్రల ఫొటోలు చూపించారు.

'ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయాలి'

కడప మారుతీనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గౌతమబుద్ధ టౌన్‌షిప్‌లో ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయాలని ఆ టౌన్‌షిప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి అధికారులను కోరారు. టౌన్‌షిప్‌లో సుమారు 80 శాతం ఇంటినిర్మాణాలు చేయడంతో లోడుకు సరిపడా విద్యుత్ కెపాసిటీ లేకపోవడంతో లోవోల్టేజీ సమస్యలు తలెత్తాయన్నారు.

అజరామరం ఘంటసాల గానం



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేస్తున్న అమీర్‌బాబు

కడప కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అజరామరం ఘంటసాల గానం అని, తెలుగు నేల ఉన్నంత వరకు ఆయన ఆలపించిన పాటలు నిత్య నూతనంగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశాయని టీడీపీ రాష్ట్ర నాయకుడు అమీర్‌బాబు కొనియాడారు. గాన గంధర్వుడు స్వర్గీయ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక నెహ్రూ పార్కులోని ఘంటసాల విగ్రహానికి అమీర్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరీముల్లా, ఇమ్రాన్, చాంద్‌బాషా, నాసర్‌ఆలీ పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామాల్లో సదస్సులు

పులివెందుల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు ఈ నెల 6 నుంచి జనవరి 7వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మహ్మద్‌నజీర్ తెలిపారు. రైతులకు కొత్త పాస్ బుక్కులు అందిస్తారు. సదస్సులో కలెక్టరు, జేసీ సైతం పాల్గొంటారన్నారు. సదస్సులు పూర్తయిన 45 రోజుల్లో సమస్యకు తప్పకుండా పరిష్కార మార్గం చూపించడమే లక్ష్యమన్నారు.

'డిగ్రీ ప్రశ్నపత్రం లీకేజీపై చర్యలు తీసుకోండి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :వైవీయూ పరిధిలో జరిగిన డిగ్రీ పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, ముబారక్‌బాషా పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనకు కృషి చేద్దాం

కమలాపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంధత్వ నిర్మూలనకు కృషి చేద్దాం అని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. బుధవారం పెద్దచెప్పలిలో కడపలోని పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి పరీక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లు ప్రధానమైనవని, అలాంటి కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈ వైద్యశిబిరంలో మొత్తం 153 మందిని పరీక్షించారు. వీరిలో 83 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. 24 మందికి కంటిశుక్లం శస్త్రచికిత్స నిమిత్తం పుష్పగిరి కంటి వైద్యశాలకు తరలించారు.

బెదిరింపులు, షోకాజ్ నోటీసులు లక్ష్యాన్ని సాధించలేవు





డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు... డీఈఓ కార్యాలయం ఎదుట గొడుగులతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

● డీఈఓకు ఎస్టీయూ వినతి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బెదిరింపులు, షోకాజ్ నోటీసులు లక్ష్యాన్ని సాధించలేవని ఎస్టీయూ నేతలు పేర్కొన్నారు. జిల్లాలో అపార్ విద్యార్థుల జనరల్ ప్రొఫైల్ వంద శాతం సాధించలేదని జిల్లా వ్యాప్తంగా 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందించారు. అనంతరం వారుమాట్లాడుతూ అపార్ కేవలం ప్రధానోపాధ్యాయులకు మాత్రమే కాదని, పిల్లలు, తల్లిదండ్రుల సాంకేతికతతో ముడిపడి ఉన్న అంశమన్నారు. జిల్లా వ్యాప్తంగా అతి త్వరలో దాదాపు 85 శాతం పూర్తి చేయడం శుభ పరిణామమన్నారు. మిగిలిన 15 శాతం అనేక సాంకేతిక అంశాలతో ముడిపడి ఉన్న కారణంగా కొంచెం ఆలస్యమవుతుందన్నారు. దీనికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని, తక్షణం ఉపసరహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.సురేశ్‌బాబు, రాష్ట్రనాయకులు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, నాయకులు గురుకుమార్, చెన్నకేశవరెడ్డి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ : ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఆక్షేపణీయమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఎస్టీయూ: ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీఎస్టీయూ రాష్ట అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, జిల్లాఉపాధ్యక్షుడు సీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్వీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనరు మజ్జా అరుణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపసంహరించుకోకుంటే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రధానోపాధ్యాయులకు డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు అన్నారు. బుధవారం వారు డీఈఓ కార్యాలయం ఎదుట వర్షంలో గొడుగులతో వినూత్న నిరసన చేపట్టారు. జిల్లాలో 20 శాతం ఇంకా పూర్తికావాల్సి ఉండగా నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని తక్షణం షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, సీవీ రమణ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు

పులివెందుల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నజీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల గ్రామ పొలంలోని రాణి తోపు వద్ద గల 462, 463 సర్వేనెంబరులోని స్థలం ప్రభుత్వ స్థలం అని, అందులో ఎవరు నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పులివెందుల పట్టణంలోని క్రిష్ణుడి దేవస్థానం సమీపంలోని పోలేపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 29లో గల భూమి ప్రభుత్వ అన్నారు. ఆ రెండు స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఈ స్థలాల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

హిందువులపై సాగుతున్న దమనకాండను ఆపాలి: బీజేపీ

కడప మారుతీనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై సాగుతున్న దమనకాండను వెంటనే ఆపాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, ఐక్య రాజ్యసమితిని కోరారు. బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. హిందువుల మానప్రాణాలకు రక్షణ లేకుండాపోతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, బీజేపీ కడప పార్లమెంటు కన్వీనరు బొమ్మన సుబ్బరాయుడు, శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియానికి 15 ఆఖరు

వల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రబీ కాలంలో సాగు చేసిన పంటల బీమా ప్రీమియానికి డిసెంబరు 15 ఆఖరు అని ఏఈ సాయిజ్యోతి అన్నారు. బుధవారం శనగ, మినుము పంటలను వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. అలాగే కొప్పోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు ఏడీఏ సలహాలు అందించారు. పంట సాగు చేయకుండా బీమా కోసం ప్రీమియం చెల్లిస్తే నష్టపోతారన్నారు. డిసెంబరు 15 లోపు ప్రీమియం డబ్బు చెల్లించాలని రైతులను కోరారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

● చిన్నచౌకు సీఐ ఓబులేసు



కడప క్రైం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చిన్నచౌకు సీఐ ఓబులేసు అన్నారు. చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి లాంటి వాటిని కట్టడి చేస్తామన్నారు. నేరాలను కట్టడి చేస్తామన్నారు. రాత్రిళ్ల గస్తీని ముమ్మరం చేస్తామన్నారు.

సీఐ నేపథ్యం: అనంతపురం జిల్లా గోరంట్లకు చెందిన ఓబులేసు 2002 బ్యాచ్‌కు చెందిన వారు. ఎస్ఐగా లక్కిరెడ్డిపల్లి, ముద్దనూరు., ఓబులవారిపల్లిలో విధులు నిర్వహించారు. సీఐగా 2012లో పదోన్నతి పొందారు. బేతంచెర్ల నుంచి ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆత్మకూరు నుంచి కడప చిన్నచౌకుకు బదిలీపై వచ్చారు.

పులివెందుల అర్బన్ సీఐగా నరసింహులు



పులివెందుల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల అర్బన్ సీఐ గా టి.నరసింహులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జీవన్ గంగానాథ్ బాబు బి.కొత్తకోటకు బదిలీ కావడంతో రాయచోటి నుంచి బదిలీపై నరసింహులు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. అనంతరం డీఎస్పీ మురళీని సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

'టికెట్ల ధరలను నియంత్రించాలి'

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సినిమా టికెట్ల ధరలను నియంత్రించాలని డీవైఎఫ్ఐ నగర కన్వీనరు విజయ్ తెలిపారు. బుధవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కొత్త సినిమా విడుదల సమయంలో విపరీతంగా టికెట్ల రేట్లు పెంచి ప్రజల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రిలీజ్ అవుతున్న పుష్ప-2 సినిమాకు టికెట్ల ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మక తప్పదన్నారు. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి ప్రజలను దోచుకుంటున్న తీరును గమనించి తక్షణం ఆయా థియేటర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి: ఎంపీడీఓ

వల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రఘురాం అధికారులకు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా మురుగు నీరు లేకుండా చూసుకోవాలన్నారు.

మానసిక రోగులకు ఉచిత వైద్య సేవలు

కడప(వినాయకనగర్),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రీ పార్మెటిల్ సొసైటీ కడప వారి ఆధ్వర్యంలో మనోబంధు ఫౌండేషన్ సహకారంతో కడప మానసిక ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లోనూ, ఫుట్‌పాత్‌పైనా ఆశ్రయం పొందుతూ మానసిక పరిస్థితి సరిగ్గా లేని వారికి సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోబంధు కో ఆర్డినేటర్ పుత్తా శివారెడ్డి, పైలెట్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నామినేషన్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :కడప కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కార్పొరేటర్లు ఆర్.బాలస్వామిరెడ్డి, ఎస్.వాణి, ఎస్.మగ్బుల్‌బాషా నామినేషన్‌ను దాఖలు చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం అడిషనల్ కమిషనర్ చంద్రంకు నామినేషన్ పత్రాలను 47వ డివిజను కార్పొరేటరు పాకా సురేశ్ అధ్యక్షతన అందించారు.

వృత్తి విద్యా కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సింహాద్రిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రెండవ విడతగా సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.తాతాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగా ట్రైనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషన్, వెల్డర్ రిపేర్ కోర్సులకు 3 నెలలు శిక్షణ ఇస్తారన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయండి


మాట్లాడుతున్న జడ్జీలు వై.జె పద్మశ్రీ, బి.గాయత్రి

బద్వేలు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న నిర్వహించబోయే జాతీయలోక్ అదాలత్ లో కక్షిదారులను రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషిచేయాలని సీనియర్‌సివిల్‌జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.గాయత్రి కోరారు. బుధవారం స్థానిక కోర్టులో నియోజకవర్గంలోని 7మండలాలు, బ్రహ్మంగారిమఠం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, అర్బన్, రూరల్‌సీఐలు, అడిషినల్ పీపీ రవిచంద్ర, అన్నిమండలాల్లోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్తుపై అవగాహన సదస్సు

దువ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఆశాఖ అధికారులు, వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. సోలార్ రూఫ్‌టాప్ అనే అంశంపై అవగాహన కల్పించే నిమిత్తం ఈ సమావేశం ఏర్పాటుచేశారు. ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణీకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద వినియోగదారుని ఇంటిపై సోలార్ ఏర్పాటుచేసుకోవచ్చునని తెలిపారు. ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో వారి గృహ అవసరాలకు వినియోగించుకుని మిగతాది విద్యుత్తు శాఖకు విక్రయించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఈడీ శ్రీనివాసులరెడ్డి, ఏఈ వీరారెడ్డి వినియోగదారులకు అవగాహన కల్పించారు.

పెండింగు బకాయిలు చెల్లించాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించి పెండింగు బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వపీఆర్సీ కమిషన్‌ను నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులెడ్డి, రాష్ట్ర కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి అబ్దుల్‌సత్తార్, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

'అదానీ కంపెనీల అవినీతిపై దర్యాప్తు చేయాలి'



మాట్లాడుతున్న చంద్ర

బద్వేలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవి.భవన్‌లో మండల కార్యదర్శుల, శాఖా కార్యదర్శులు, ఏరియా కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా డిమాండ్స్‌డేగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ కార్యదర్శి పి.బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి నూతన విగ్రహం ఏర్పాటు



ఖాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుంపలగట్టులో నూతనంగా గంగమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో ముందున్న విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో గ్రామస్థులందరూ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా వేద పండితులు వివిధ పూజలు చేసి బుధవారం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 41 రోజులపాటు గ్రామంలో ఎటువంటి మాంసాహార పదార్థాలు తినకుండా పూజలు నిర్వహించి 41వ రోజు అమ్మవారికి భోనాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకుంటారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కార్యనిర్వాహకులు ములబాకు నాగిరెడ్డి, రెడ్యం ఈశ్వర్‌రెడ్డి, పత్తి ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

హైబ్రిడ్ సజ్జ నారు పరిశీలన



కాశినాయన డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లె, నర్సాపురం, పిట్టిగుంట తదితర గ్రామాల్లో రైతులు పోసిన హైబ్రి సజ్జనారును బుధవారం ఏవో జయలక్ష్మీ,నర్సాపురం వీఏఏ నవీన్ పరిశీలించారు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న తుఫాన్‌తో కొన్నిగ్రామాల్లో సజ్జ నారు నీటమునగడం వర్షం మూలంగా నాట్లు ఆగిపోవడంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో తుఫాన్‌తో హైబ్రిడ్ సజ్జసాగుకు అంతరాయం అనే కథనం ప్రచురితమైంది.స్పందించిన వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడి నీటమునిగిన నార్లకు కుళ్ళు తెగులు సోకకుండా 1లీటరు నీటిలో 1గ్రాము కార్బొండిజం చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పలు కంపెనీల ఆర్గనైజర్లతో మాట్లాడామని నారుముదిరిన రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు.

'ఎస్‌ఐ చిరంజీవి బదిలీ ఆపాలి'

కలసపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు మండలంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న చిరంజీవి మూడు నెలలు సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మన్ననలు పొందారని ఆయనను బదిలీ చేయడం మంచిది కాదని సీపీయం మండల కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఉదయం మూడురోడ్ల కూడలిలో ఎస్‌ఐ బదిలీ ఆపాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీయం మండల నాయకులు గురవయ్య, సుదర్శన్, నాగూరువలి పాల్గొన్నారు.

నీరు పోయే మార్గమేది..?

ఇబ్బందుల్లో స్థానికులు


మోరగుడిలోని రైతు సేవా కేంద్రం-1 వెళ్లే దారిలో మోకాళ్లలోతు ఆగిన నీరు

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో సోమవారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి జమ్మలమడుగు ప్రాంతంలో చిరుజల్లులు కురుస్తూనే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ కారణంగా చిరుజల్లులు కురుస్తూ ప్రజలకు, రైతాంగానికి, ఇతర పనులు చేసుకునేవారికి, వ్యాపారస్థులకు ఇబ్బందికరంగా మారింది. ఏది ఏమైనా సాయంత్రం సుమారు 45 నిమిషాలపాటు మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. అలాగే మండలంలోని మోరగుడి గ్రామంలో రైతు భరోసా కేంద్రం-1 వెళ్లే దారి, మటన్‌మార్కెట్ ఎదురుగా మోకాళ్లలోతు వర్షపునీరునిలిచాయి. అలాగే ప్రధాన రోడ్డులోని చౌడేశ్వరీదేవి దేవాలయం, హనుమాన్ దేవాలయం ఎదురుగా వర్షపు నీరు నిలిచింది. రైతుభరోసా కేంద్రం-1 వెళ్లే దారిలో వర్షపు నీరు నిలిచి డ్రైనేజీ నీరు కలిసి కంపు కొడుతోంది. స్థానికులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మంచి మెజార్టీ ఇచ్చామని, తమ వీధిలోని రోడ్డులో చిన్న వర్షం వచ్చినా వర్షపునీరు ఎక్కువగా ఆగుతాయని వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

అనంతగిరిలో ఓంకార స్థాపన



బద్వేలు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సిద్దవటం లోని సాయిబాబా, అయ్యప్ప స్వామి, వెంకయ్యస్వామి ఆలయ సముదాయాలు ఉన్న అనంతగిరి పై బుధవారం ఓంకారస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జనవరి 5న నిర్వహించబోయే హైందవ శంఖారావం కరపత్రాలను హైందవ శంఖారావం కన్వీనర్ కొండపల్లె వెంకటసుభాష్‌కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రామకోటిరాజు, గంగసానిసాంబశివారెడ్డి, శంభుప్రసాద్, కేవీసుబ్బారావు, యోగారాయల్, రామయ్య, చింతరెడ్డి రామచంద్రారెడ్డి, నాగేశ్వరరావు, వేదపండితులు బ్రహ్మశ్రీ కనమల్ల సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ డైరెక్టరు ఆదేశాల మేరకు కమిషనరేట్ కార్యాలయ అధికారులు డాక్టర్ విజయ్‌బాబు, వర ప్రసాద్, డాక్టర్ జాన్‌కిరణ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని రికార్డులను పరిశీలించారు. వారు కళాశాలలోని అన్ని విభాగాలకు వెళ్లి ఐదేళ్లకు సంబంధించిన వివిధ నాక్ రికార్డులను తనిఖీ చేశారు. కళాశాల నాక్‌గ్రేడ్‌కు వెళుతున్న సందర్భంలో ఈ సీసీఈ బృందం విజిట్ చేసి రికార్డుల నిర్వహణకు సంబంధించిన పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

'ఆర్.క్రిష్ణయ్యను విమర్శించడం తగదు'

బద్వేలు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉండే బీసీల సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమిస్తూ ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తున్న ఆర్. కృష్ణయ్యను విమర్శించడం సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బాలచెన్నయ్య యాదవ్‌లు పేర్కొన్నారు. బుధవారం పట్టణలోని బీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లకు నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌తో మాట్లాడి స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించిన ఘనత క్రిష్ణయ్యకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు వెంకటరమణ, సుబాన్, సుబ్బరాయుడు, రంగయ్య, అన్వర్‌బాష , బోలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులేషన్ ప్యాటర్న్ రూపొందించండి


సమీక్షిస్తున్న సంజీవ్ కుమార్

ప్రొద్దుటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మాస్టర్ ప్లాన్ లోలేని అంతర్గత రోడ్లకు సర్క్యులేషన్ ప్యాటర్న్ రూపొందించి మ్యాపింగ్ చేయాలని టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ సభాభవనంలో మున్సిపాలిటీ పరిధిలోని 45 సచివాలయాలకు చెందిన వార్డుప్లానంగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం ఆర్డీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రహదారుల్లో రోడ్డు వున్నంత మేరకు ప్లానులు పెట్టి అనుమతులు ఇవ్వాలన్నారు. అలాగే బిల్డింగ్ పర్మిషన్లల్లో షాట్‌ఫాల్స్ వుంటే వెంటనే వాటికి సంబంధించినవి పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు క్లియర్ చేయాలన్నారు. త్వరలో టౌన్ ప్లానింగ్ నిబంధనలు మార్చుతూ కొత్త పాలసీ రూపొందనుందన్నారు. 168 జీవోను పూర్తి స్థాయిలో అనుసరించాల్సిన అవసరరం లేదన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులోకి స్వల్పంగా వరదనీరు

కొండాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలతో గండికోట ప్రాజెక్టులోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.వరద కాలువ ద్వారా, వర్షపునీరు కలిపి 300 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వస్తోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి ఔట్‌ఫ్లో ఏమీ లేదని ఈఈ తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.125 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఎర్రగుంట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6న ప్రత్యేక విద్యుత్ ప్రత్యేక అదాలత్‌ను జమ్మలమడుగు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్‌కుమార్, ఏఈ టౌన్ ప్రియదర్శన్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎర్రగుంట్లటౌన్, రూరల్, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాలకు చెందిన వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బద్వేలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంత కాలనీలలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని సుందరయ్య కాలనీ,ఐలమ్మ కాలనీ, జ్యోతి బసు కాలనీలలో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం బద్వేలు కమిటీ సభ్యులు చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవం అయ్యప్పస్వామి గ్రామోత్సవం


జమ్మలమడుగు, పోరుమామిళ్లలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం శివాలయంలో అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుకున్నారు. సాయంత్రం శివాలయం వద్ద నుంచి అయ్యప్పస్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో భాగంగా భక్తులు అంబులంపూజ నిర్వహించారు. గ్రామోత్సవం వెంట గ్రామస్థులు, విద్యార్థులు కోలాటం నిర్వహించారు. 5వ తేదీ శివాలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

పోరుమామిళ్ల..: అయ్యప్పస్వాముల గ్రామోత్సవం ఘనంగా నిర్వహిం చారు. బుధవారం సాయంత్రం అయ్యప్పదీక్షాపరులు, భక్తులు అంబేడ్కర్ సర్కిల్ నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పదీక్షాపరులు భజనలు చేసుకుంటూ అయ్యప్పస్వామిని స్మరించుకుంటూ స్వామి గుడి వరకు పాల్గొన్నారు. అలాగే ఈ గ్రామోత్సవ సందర్భంగా కోలాట ప్రదర్శన ఇచ్చారు. ఈ గ్రామోత్సవ కార్యక్రమం తిలకించేం దుకు పట్టణ ప్రజలు, మహిళలు ఎక్కువ ఆసక్తి కనబరచి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేశారు.

అక్రమాలు అడ్డుకుంటాం

ఎస్‌ఐ వినోద్‌కుమార్



దువ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల పరిధిలో శాంతి భద్రతల సమస్య పర్వాలేదనిపిస్తోంది. అక్కడక్కడ చట్టవిరుద్ధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొన్ని విషయాల్లో పోలీసు సిబ్బందిపై విమర్శలున్నాయి. కేసు నమోదులపరంగా రాజకీయ ఒత్తిడులు ఎదురవుతున్నా ఏదోలా ఆ సమస్యను అధిగమిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలో ఎర్రచందనం, అక్రమ బియ్యం, మట్కా నిర్వహణ లాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ వినోద్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ నిర్వహించింది.

ప్రశ్న: వృత్తిలో మీ పైస్థాయి అధికారుల సహకారం ఎలా ఉంది.

జవాబు: చాలా బాగుంది. సీఐ, డీఎస్పీల సహకారంతో వారి సూచనల మేరకు కేసులు పరిష్కరిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొల్పుతున్నాను.

ప్రశ్న: ఎలాంటి కేసులు వస్తున్నాయి.

జవాబు: కొట్లాటలు, యాక్సిడెంట్లు, అసహజమరణాలు, మహిళా వేధింపుల సమస్యలు ఉన్నాయి.

ప్రశ్న: కేసుల నమోదు, నిబంధనల పాటింపు విషయంలో రాజకీయ ఒత్తిడులు ఏమైనా ఉన్నాయా.

జవాబు: అలాంటివి ఏమీ లేవు.

ప్రశ్న: లారీల్లో చట్టవిరుద్ధ రవాణా జరుగుతుంటే మీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలపై మీ కామెంట్.

జవాబు: అలాంటి విషయాలు మా దృష్టికి రాలేదు. డబ్బుల డిమాండ్, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి సాగు, మట్కా లాంటివి ఈ ప్రాంతంలో ఏమైనా గమనించారా.

జవాబు: ఎర్రచందనం అక్రమ రవాణా ఉంది. దానరిపల్లె, క్రిష్ణంపల్లె బీట్ల పరిధిలో రాత్రివేళ గస్తీ వెళుతున్నాం. గజాయి సాగు లేదు. మట్కాపై నిఘా ఉంచాం.

ప్రశ్న: బ్రాందీషాపులకు అనుగుణంగా బెల్టుషాపులు, గ్యాంబ్లింగ్, సారా తయారీ లాంటివి ఏమైనా జరుగుతున్నాయా.

జవాబు: బెల్టుషాపులకు అనుమతి లేదు. నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లు దొరికితే కేసులు నమోదు చేస్తున్నాం. గ్యాంబ్లింగ్ కేసులు నమోదు అవుతున్నాయి. సారా తయారీ లేదు.

ప్రశ్న: మహిళా సంరక్షణకు మీ పోలీసు శాఖ ద్వారా మీరిచ్చే అభయహస్త సందేశం ఏమిటి.

జవాబు: స్టేషన్ పరిధిలో లేడీ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం. వారికున్న సమస్యలపై మహిళలు ఫోన్ చేస్తే వెంటనే స్పాట్‌కు వెళుతున్నాం.

ప్రశ్న: మండలంలో చౌక దుకాణాల బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుందనే విమర్శలు ఉన్నాయి.మీరేమంటారు.

జవాబు: బియ్యం అక్రమ వ్యాపారం విషయంలో ఇప్పటికి రెండు కేసులు నమోదు చేశాం. మా దృష్టికి వస్తే అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

'కడప ఉక్కుపై కేంద్రం వైఖరి దారుణం'

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాల్లో కడప ఉక్కు సమస్య ప్రభుత్వం దగ్గర లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పేర్కొనడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్‌పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి కడప ఉక్కు పరిశ్రమపై వివక్ష ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు విశ్వనాధ్, హరిసాయి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యంపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి


కలసపాడు... చెన్నపల్లెలో మినుముపంటను పరిశీలిస్తున్న అధికారులు, జమ్మలమడుగులో శనగపంటను పరిశీలిస్తున్న దృశ్యం

చాపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షం కురుస్తున్నందున తడిసిని వరి ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు రైతులు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని ఏవో మ్యాగి చెప్పారు. సోమాపురం, మొరాయిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వరికోతలు కోయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ అధికారి పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో బుధవారం ఏవో చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంట, ఇతర పంటలను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో సాగు చేసిన శనగ పంటను కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త ఉమామహేశ్వరి సందర్శించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సున్నపురాళ్లపల్లె, ఎస్.ఉప్పలపాడు గ్రామ రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం..: ప్రధాని ఫసల్‌బీమా కింద ఈ నెల 15 లోపు రైతులు క్రాప్ ఇన్సూరెన్స్‌కు ప్రీమియం చెల్లించాలని ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నమనేని పల్లె గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అదేవిధంగా వరికి ఈ నెల 31లోపుబీమాకు ప్రీమియం చెల్లించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని మునల్‌రెడ్డిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో జాకీర్, డి.పావని, ఏపీ సీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాగునీరు పరిశీలన..: మూడురోజులుగా కురుస్తున్న వర్షం వల్ల చెన్నుపల్లి గ్రామం ద్వారా రాచెరువులో కలిసే వాగునీరు పొలాల్లోకి రావడం వల్ల దిగువలో సాగులో ఉన్న వరి ,మినుము పంటలు నీట మునిగాయి. 60 ఎకరాలు వరి,50 ఎకరాలు మినుము పంట నష్టం జరిగినట్లు ప్రాధమిక అంచనా నివేదిక ఉన్నతాధికారులకు పంపించినట్లు ఏవో జాకీర్ షరీఫ్ తెలిపారు.